నమస్తే తెలంగాణ
జోగులాంబ గద్వాల వనపర్తి
3 | మహబూబ్‌నగర్, మంగళవారం 24 సెప్టెంబర్ 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

గద్వాల టు బంగారుపేట్

- ప్రజాపంపిణీ బియ్యం పక్కదారి
- రూ.కోట్లకు పడగలెత్తిన అక్రమార్కులు
- సిండికేట్ వ్యవహారంలో అధికారుల పాత్ర

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 23 : పేదల కడుపు నింపేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నవి. అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ కోట్లు కుప్పేస్తున్నారు. పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న రేషన్ బియ్యం అక్రమార్కులకు వరంగా మారింది. జిల్లాలో ప్రతినెలా అక్రమ దందా జోరుగా సాగుతున్నారు. కొంతమంది సిండికేట్‌గా మారి రైస్‌మిల్లులో రీసైక్లింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఈ వ్యవహారంలో సంబంధిత శాఖ అధికారుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రైతుల ద్వారా కొను గోలు చేసిన వడ్లను ప్రభుత్వం మిల్లర్లకు అందజేస్తోంది. రైస్ తయారైన తర్వాత బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులు పర్యవేక్షించి రేషన్ షాపులకు సరఫరా చేస్తారు. అయితే రైతుల నుంచి సేకరించిన వడ్లను పలు దఫాలుగా అధికారుల లెక్కల ప్రకారం మిల్లర్లు రైస్‌ను అందించాలి. ఇక్కడే రైస్ మిల్లర్లు తమ చేతివాటం ప్రదర్శిస్తూ.. బియ్యాన్ని అక్రమంగా కర్ణాటకలోని బంగారుపేట్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. అయితే వీరి వ్యవహారానికి జిల్లా కేంద్రంలో అధికార పార్టీకి చెందిన ఓ రాజకీయ నాయకుడి అండదండలు పుష్కలంగా ఉండడంతో అక్రమార్కుల దందా.. మూడుపువ్వులు..ఆరు కాయలుగా నడుస్తున్నది. అలాగే ప్రభుత్వ శాఖలో విధులు నిర్వహిస్తున్న కొందరి అధికారుల పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీరికి నెలనెలా మామూళ్లు కూడా అందుతున్నట్లు సమాచారం. కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారి వరకు ర్యాంకును బట్టి లెక్క ఉంటుందని సమాచారం. అయితే, గద్వాల నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బంగారు పేట్‌కు ఓ రేషన్ లారీని అక్రమంగా తరలిస్తుండగా.. ఏపీలోని అనంతపురం జిల్లా పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నట్లు తెలిసింది. లారీలో ఉన్న బియ్యానికి సరైన లెక్కలు లేకపోవడంతో పలు అనుమానాలకు దారి తీసింది. లారీ ఎక్కడి నుంచి వచ్చిందో.. బియ్యం ఎక్కడివి.. అనే కోణంలో ఏపీ పోలీసులు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. కొంతకాలంగా బంగారుపేట్ అడ్డాగా తెలంగాణలోని కొన్ని జిల్లాల రైస్ మిల్లర్లు అక్రమ దందా కొనసాగిస్తున్నట్లు ఏపీ పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలు (ఫైల్)

ఎవరినీ వదలం..

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం. జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లే గూడ్స్ వాహనాలను నిత్యం తనిఖీ చేస్తున్నాం.. తనిఖీలో అక్రమంగా రేషన్ తరలిస్తున్న వాహనాలను పట్టుకొని సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నాం. ఈ వ్యవహారంలో ఎవరున్నా.. ఉపేక్షించేది లేదు. ప్రభుత్వ అధికారులున్నా.. ప్రైవేట్ వ్యక్తులున్నా.. చర్యలు తీసుకుంటాం.

- సత్యనారాయణ, గద్వాల డీఎస్పీ

2023-24 వానకాలం సీజన్‌కుగానూ మొత్తం 63,513 మెట్రిక్ టన్నుల ధాన్యం 65 రైస్ మిల్లులకు కేటాయించారు. ఇందుకుగానూ మిల్లర్లు బియ్యం రూపంగా 45,353 మెట్రిక్ టన్నులు తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 38,171 మెట్రిక్ టన్నులు తిరిగి ఇచ్చారు. ఇంకా 7,182 మెట్రిక్ టన్నులు బకాయి ఉన్నారు.

2023-24 యాసంగి సీజన్‌కుగానూ 52,347 మెట్రిక్ టన్నుల ధాన్యం 36 మిల్లులకు కేటాయించారు. ఇందుకు 35,522 మెట్రిక్ టన్నులు బియ్యం తిరిగి చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 17,480 మెట్రిక్ టన్నులు చెల్లించారు. ఇంకా 18,041 మెట్రిక్ టన్నుల బకాయి ఉంది.

- పాల మూలులో రూ.9 కోట్ల ధాన్యం స్వాహా?
- సేకరించాల్సింది.. 25,223 మెట్రిక్ టన్నులు
- బియ్యం సేకరణకు ఇంకా 8 రోజుల గడువే..
- తనిఖీలు చేస్తే అక్రమాలు వెలుగులోకి..
- గడువులోగా సీఎం ఆర్ సేకరణ ప్రశ్నార్థకమే..?

మిల్లర్ల మాయ!

మరాడించకుండానే హాంఫట్



ఇతర రాష్ట్రాలకు తరలించడంతోనే..

ప్రభుత్వం మిల్లర్లకు కేటాయించిన సీఎం ఆర్ ధాన్యం యజమానులు అక్రమార్జన కోసం ఇతర రాష్ట్రాలకు తరలించి రూ.కోట్లు సొమ్ము చేసుకుంటున్నారు. తనిఖీలు, దాడులు చేసే అధికారులు నిర్లిప్తంగా ఉండటంతో ధాన్యం రాష్ట్రం దాటిపోతుందనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో 2022-23లో ధాన్యం పక్క రాష్ట్రాలకు తరలి పోగా.. ఆలస్యంగా మేలుకొన్న అధికార యంత్రాంగం, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కొన్ని నెలల కిందట మిల్లులపై దాడులు చేశారు. మహబూబ్ నగర్ జిల్లాలో 3,002 మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలు మాయమైనట్లు గుర్తించారు. అప్పట్లో అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై నామమాత్రంగా చర్యలు తీసుకొని వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం ఎన్నిసార్లు గడువు పెంచినా.. మిల్లర్ల వద్ద ధాన్యమే లేకపోతే ప్రభుత్వానికి ఎలా ఇస్తారంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 23 : మహబూబ్‌నగర్ జిల్లాలో 2023-24 (వానకాలం-యాసంగి) సీజన్‌లో సేకరించిన ధాన్యం మరఆడించి సీఎం ఆర్ రూపకంగా తిరిగి బియ్యాన్ని అప్పగించేందుకు మిల్లర్లకు పౌరసరఫరాల శాఖ అప్పగించింది. ఈ నెలాఖరు నాటికి ప్రభుత్వానికి ఇచ్చేందుకు గడువు ఉన్నది. అయితే ఈ సమయం 8 రోజులే ఉండగా నేటికీ సీఎంఆర్ బియ్యం 25,223 మెట్రిక్ టన్నులు అప్పగిస్తారా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గడువులోగా అందించడం కష్టమేనని పలువురు పేర్కొంటున్నారు. 2022-23 యాసంగి సీజన్‌కు గానూ మహబూబ్ నగర్ జిల్లాకేంద్రానికి సమీపంలోని అల్లీపూర్ లక్ష్మీనరసింహ ఇండస్ట్రీస్‌కు 3,002 మెట్రిక్ టన్నుల ధాన్యం (దాదాపు రూ.9 కోట్లకుపైగా..) కేటాయించగా.. ఆ ధాన్యం పక్కదారి పట్టింది. ఈ నేపథ్యంలోనే 2023-24 రెండు సీజన్లలో ప్రభుత్వానికి రావాల్సిన సీఎం ఆర్ బియ్యం భారీగా పెండింగ్‌లో ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

పెట్టుబడిలేని వ్యాపారంగా..

రూపాయి పెట్టుబడి లేకుండా ప్రభుత్వమే ధాన్యం ఇవ్వడం మర ఆడించిన తర్వాత 67 శాతం బియ్యం మాత్రమే తిరిగి ఇవ్వాలని నిబంధనలు ఉండడంతో మిల్లు యజమానులకు బియ్యం వ్యాపారం కాసులు కురిపిస్తుంది. ప్రభుత్వం రైతుల వద్ద ధాన్యం కొను గోలు చేసి మిల్లర్లకు మర ఆడించి ఇవ్వడానికి ఉచితంగా ఇస్తుండటంతో ఎలాంటి పెట్టుబడి లేని వ్యాపారంగా మారింది. ఈ సీజన్లో ఇచ్చి ధాన్యాన్ని వెంటనే ప్రభుత్వానికి తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేస్తూ సదరు ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు విక్రయించుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. చూస్తుండగానే మరో సీజన్ రావడం ప్రభుత్వం మళ్లీ ధాన్యం ఇవ్వడం.. ధాన్యాన్ని మర ఆడించి కొంత మేరకు ప్రభుత్వానికి తిరిగి ఇవ్వడం, మరి కొంత పెండింగ్‌లో పెట్టడం ఇలా వరుసగా చేస్తూ లాభాలు గడిస్తున్నారు.

ప్రభుత్వం మిల్లర్లకు కేటాయించిన ధాన్యం (ఫైల్)

క్రిమినల్ కేసు నమోదు

మహబూబ్ నగర్ జిల్లాలోని లక్ష్మీనరసింహస్వామి ఇండస్ట్రీస్ యాజమాన్యం రూ.9.43 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉన్నది. అలా ఇవ్వని పక్షంలో రెవెన్యూ రికవరీ చట్ట ప్రకారం మిల్లు యజమాని, మిల్లుకు జామీను ఉన్న వారి ఆస్తులను జప్తు చేసేందుకు కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయి. ఇప్పటికే క్రిమినల్ కేసు నమోదు చేశాం. గడువులోపు సీఎం ఆర్ చెల్లించకుంటే ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యంలో నూటికి 125 శాతం జరిమానాతో వసూలు చేయనున్నాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిల్లర్లు నడుచుకోవాలి. లేకుంటే చర్యలు తప్పవు.

- విక్రమ్, పౌరసరఫరాల సంస్థ ఇన్‌చార్జి డీఎం, మహబూబ్‌నగర్

ఆర్నెళ్లుగా అంధకారంలోనే..



అంధకారంగా మారిన కిష్టంపల్లి

అమరచింత, సెప్టెంబర్ 23: గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేనిలోటు ప్రత్యేకాధికారుల పాలనలో కండ్లకు కట్టినట్లు కనపడుతున్నాయని, గ్రామంలో ఆర్నెళ్లుగా రాత్రిళ్లు అంధకారంలో మగ్గుతున్నామని అమరచింత మండలంలోని కృష్టంపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు సుధాకర్, రాజు, బీజేపీ నాయకులు కురుమన్న, మల్లారెడ్డి, కుర్వ హరీశ్ సోమవారం విలేకరులతో మాట్లాడారు. సర్పంచుల పదవీకాలం ముగిసినప్పటి నుంచి కృష్ణంపల్లిలో వీధిదీపాలు వెలగక గ్రామమంతా చీకటిమయం మారుతోందని ఆరోపించారు. వ్యవసాయ పొలాలు దగ్గరగా ఉండడంతో రాత్రిళ్లు పాములు సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా చీకటిని ఆసరాగా చేసుకుని కొంతమంది చోరీలకు పాల్పడుతున్నారని వాపోయారు. వీధిదీపాలు వేయించాలని వారం నుంచి పంచాయతీ కార్యదర్శి పుష్ప దృష్టికి తీసుకెళ్లగా.. ప్రత్యేకాధికారి, తాసీల్దార్ రమేశ్‌రెడ్డి గ్రామాన్ని విజిట్ చేసిన తర్వాతనే వీధిదీపాలు వేయించాలని చెబుతున్నట్లు కార్యదర్శి చెప్పారని పేర్కొన్నారు. ప్రత్యేకాధికారి వచ్చి రెండు నెలల వుతున్నా ఒక్కసారి కూడా గ్రామానికి రాలేదని విస్మయం వ్యక్తం చేశారు. కలెక్టర్, జిల్లా అధికారులు స్పందించి గ్రామంలో వీధిదీపాలను వేయించడంతో పాటు మురుగుతో నిండిపోయిన డ్రైనేజీలను శుభ్రం చేయించాలని కోరారు.

ప్రభుత్వ దవాఖానల్లో సౌకర్యాలేవీ?

మద్దూర్ దవాఖానలో రోగులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

- మందుల్లేక మూడు నెలలు తిప్పా పట్టిం చకోరా
- కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి
- మద్దూర్ ప్రభుత్వ దవాఖాన తనిఖీ

మద్దూర్ (కొత్తపల్లి), సెప్టెంబర్ 23: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను సోమవారం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి తనిఖీ చేసి రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు కేటాయించి వైద్యపరికరాలను ఏర్పాటు చేస్తే.. ప్రస్తుతమున్న కాంగ్రెస్ ప్రభుత్వం మక్తల్ దవాఖానకు ఎందుకు తరలించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి ప్రజలకు పరికరాలు అవసరం లేదా అని ఖండించారు. సీఎం రేవంత్ నియోజకవర్గంలోనే ఇలా ఉంటే రాష్ట్రమంతా పరిస్థితి ఎలా ఉంటుందని ప్రశ్నించారు. రోగులకు మందుల్లేక మూడు నెలలవుతుందంటే అధికారులు, ఆరోగ్య శాఖ మంత్రి ఏం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ శాసం రామకృష్ణ, కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీరారెడ్డి, బీఆర్ఎస్ మద్దూర్ మండలాధ్యక్షుడు గోపాల్, కొత్తపల్లి మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గ నాయకులు సలీం, శేఖర్, బసిరెడ్డి, బుగ్గప్ప, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీఎస్‌లో ముగిసిన వైద్యవిజ్ఞాన సదస్సు

మనిషి మెదడు చూపిస్తున్న వైద్యుడు

మహబూబ్ నగర్, సెప్టెంబర్ 23: ఎస్వీఎస్ మెడికల్ కళాశాలలో నాలుగు రోజులుగా నిర్వహించిన వైద్యవిజ్ఞాన సదస్సు సోమవారం ముగిసింది. ఎస్వీఎస్ కళాశాల ఏర్పాటు చేసి 25ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా (ఎస్వీఎస్ మెడ్ ఎక్స్ పో-2024)లో మానవ శరీరంలోని అవయవాలు, వైద్య సేవలను ప్రదర్శనకు ఉంచారు. ప్రదర్శనను తిలకించేందుకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులు 25 విభాగాలకు సంబంధించి విద్యార్థులకు కండ్లకు కట్టినట్లు అవగాహన కల్పించారు. మొత్తం 1200 రకాల స్టాళ్లను ఏర్పాటు చేయగా.. 50వేల పైచీలుకు విద్యార్థులు తిలకించినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులకు మెడిసిన్‌పై అవగాహన పెంచే ప్రయత్నంలో వైద్య విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెసిడెంట్ కార్యదర్శి రాంరెడ్డి, ప్రిన్సిపాల్ జోషి, వైస్ ప్రిన్సిపాల్ రోహిత్, దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్య విద్యార్థినులు

డ్రైనేజీ పనులను అడ్డుకున్న పుర కమిషనర్

- శాంతిన గర్ 10వ వార్డులో కౌన్సిలర్లు, సిబ్బంది మధ్య ఘర్షణ

10వ వార్డులో చేపడుతున్న డ్రైనేజీ పనులు

వడ్డేపల్లి, సెప్టెంబర్ 23: మున్సిపాలిటీ కేంద్రంలోని ఓవార్డులో కౌన్సిలర్ చేపడుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ అడ్డుకున్న ఘటన చోటుచేసుకున్నది. వివరాలిలా.. శాంతిన గర్ మున్సిపాలిటీ 10వ వార్డులోని ఓ కాలనీలో నెల కొన్న డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కమిషనర్, ఏఈకి కాలనీవాసులు, కౌన్సిలర్లు ఆరు నెలలుగా మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. దీంతో వార్డు కౌన్సిలర్ ధనలక్ష్మి మున్సిపాలిటీలో తీర్మానం తీసుకొని 60 సిమెంటు పైపులను కొను గోలు చేశారు. కూలీలతో సోమవారం పనులను ప్రారంభించారు.. మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి సిబ్బందిని పంపించి పనులు నిలిపివేసి, పైపులను తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. ఈ క్రమంలో మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్‌కు మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. సమస్య తీవ్రంగా ఉన్నందునే పనులు చేపట్టామని, మీరు అడ్డుకోవద్దని కౌన్సిలర్ భర్త శ్రీనివాస చౌదరి మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. విషయం తెలుసుకున్న పక్కవార్డు కౌన్సిలర్లు ఆంజనేయులు, చైర్‌పర్సన్ భర్త వడ్డేపల్లి సూరి, తోటరవి ఘటనా స్థలానికి చేరుకొని సిబ్బందిని వెనక్కి పంపారు. ఈ విషయమై కమిషనర్‌ను వివరణ కోరగా.. టెండర్ కాలేదు, వర్క్‌ఆర్డర్ ఇవ్వలేదు. వాళ్లంతకు వాళ్లే పనులు చేపడితే ఎలాగని ప్రశ్నించారు. తీర్మానం చేస్తున్నామంటారు, మరో సారి కాలనీవాసుల సమస్య తీర్చడానికి సొంతంగా పనులు చేస్తున్నామంటున్నారు. పొంతన లేని సమాధానాలతో పనులు నిలిపి వేసినట్లు తెలిపారు.

కృష్ణ, తుంగభద్రకు స్వల్ప వరద

అయిజ, సెప్టెంబర్ 23: కర్ణాటకలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కృష్ణ, తుంగభద్ర నదులకు స్వల్ప వరద వచ్చి చేరుతున్నది. సోమవారం తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 10, 548 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 10,564 క్యూసెక్కులు, ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 9,310 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 8,700 క్యూసెక్కులు, ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 13,285 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 16,144 క్యూసెక్కులు, నారాయణపుర ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 14,005 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 12,753 క్యూసెక్కులు నమోదైట్లు డ్యాం అధికారులు తెలిపారు.

కలకలంరేపిన చిరుత సంచారం

దామరగిద్ద, సెప్టెంబర్ 23: మండంలోని బాపన్‌పల్లిలో చిరుత సంచారం కలకలం రేపింది. ఆదివారం రాత్రి పొలాల మధ్యలో తిరుగుతూ మేకను ఎత్తుకెళ్లిందని మేకల కాపరి గ్రామస్తులకు తెలిపాడు. ఎంపీడీవో సాయిలక్ష్మి సహకారంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీశాఖ అధికారులు సోమవారం ఉదయం బోను ఏర్పాటు చేసి అందులో ఎరగా మేకను ఉంచారు. సోమవారం రాత్రి 8గంటల వరకు కూడా చిరుత రాలేదు. దీంతో రైతులు పొలాలకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని, పశువులను అడవిలో కాకుండా ఇంటి వద్దనే ఉంచుకోవాలని సూచించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కోర్టు ఆవరణను శుభ్రం చేస్తున్న న్యాయమూర్తులు

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 23: మనచుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని జోగులాంబ గద్వాల జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.కుషాలి పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు.. సోమవారం జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో స్వచాత్ స్వచ్ఛత- సంస్కార్ స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే రోగాలు దరిచేరవన్నారు. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు హైమవతి, ఉదయ్‌నాయక్, కోర్టు ఏవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో భర్తను హత్యచేయించిన భార్య

బాలానగర్, సెప్టెంబర్ 23 : అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని... ప్రియుడితో భర్తను దారుణంగా హత్య చేయించింది. బాలానగర్ మండలం పెద్దాయపల్లిలో ఈనెల 18న రాత్రి 9:30 గంటల ప్రాంతంలో దారుణ హత్యకు గురైన సంపంగి పర్వతాలు (35) హత్య కేసులో నిందితులు పర్వతాలు భార్య అనసూయ, ఆమె ప్రియుడు బాలానగర్ మండలం గుండేడులో నివాసం ఉండే వికారాబాద్ జిల్లాకు చెందిన బాలరాజు (అలియాస్ బాలకృష్ణ, అలియాస్ కిట్టు)ను సోమవారం రాత్రి జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా హత్యకు సంబంధించిన వివరాలు సీఐ నాగార్జునగౌడ్ వెల్లడించారు. వికారాబాద్ జిల్లాకు చెందిన బాలరాజు గుండేడుకు చెందిన మేనమామ వద్ద ఉంటూ పెద్దాయపల్లి స్టేజీపై టిఫిన్ సెంటర్‌ను నడిపిస్తుంటాడు. పెద్దాయపల్లికి చెందిన సంపంగి పర్వతాలు జాతీయ రహదారి పక్కన పెద్దాయపల్లి స్టేజీపై టీదుకాణం నడిపిస్తుంటాడు. తరచూ భర్త టీదుకాణం దగ్గరకు వచ్చే అనసూయతో పక్కనే టిఫిన్ సెంటర్ నడిపించే బాలరాజుకు పరిచయం ఏర్పడింది. కొంతకాలంగా ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. అయితే భర్త పర్వతాలు కారణంగా వీరికి కలుసుకునే అవకాశం దొరకడం లేదు. దీంతో తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా వస్తున్నాడని.. ఎలాగైనా పర్వతాలను అడ్డుతొలగించుకోవాలని పథకం వేశారు. ఈనెల 18న రాత్రి 9:30 గంటల వరకు టీ దుకాణం దగ్గరే ఉన్న భర్తను మద్యం తాగడానికి పిలవాలని అనసూయ తన ప్రియుడు బాలరాజుకు చెప్పింది. అంతకు ముందే సమీపంలోని స్పెక్టా వెంచరులో గొడ్డలిని సిద్ధంగా ఉంచారు. అనుకున్న పథకం ప్రకారం పర్వతాలను 9:30 గంటలకు తాగడానికి బాలరాజు పిలిచాడు. కొద్దిసేపటికి మద్యం మత్తులోకి వెళ్లిన పర్వతాలు మెడపై బాలరాజు గొడ్డలితో కొట్టాడు. గట్టిగా అరుస్తూ పడిపోయిన పర్వతాలు గొంతుపై గొడ్డలితో మరో రెండుసార్లు కొట్టాడు. దీంతో పర్వతాలు అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం కొద్దిసేపటికి ఇంటిదగ్గర ఉన్న అనసూయ భర్త పర్వతాలుకు ఫోన్ చేసింది. ఎంతకూ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుకున్న పని జరిగిపోయిందని మనసులో ఆనందపడుతూనే కుటుంబ సభ్యులను వెంటబెట్టుకొని అనసూయ భర్త నడిపిస్తున్న టీ దుకాణం దగ్గరకు వచ్చింది. దుకాణం మూసి ఉండటంతో చుట్టుపక్కల కుటుంబ సభ్యులతో కలిసి గాలించింది. కొద్దిదూరంలో రక్తపుమడుగులో పర్వతాలు మృతదేహం కనిపించడంతో బోరున ఏడుస్తూ పోలీసులకు సమాచారం అందించింది. కేసు నమోదు చేసిన పోలీసులు అనసూయ ప్రవర్తనపై అనుమానంతో విచారణ చేసి ఆమె అపరాధిగా నిర్ణయించారు. తాత్కాలిక సుఖం కోసం ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన అనసూయను, ఆమె భర్త పర్వతాలను హత్య చేసిన బాలరాజును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై తిరుపతి, పోలీసులు హెచ్‌సీ దౌలత్, బాలరాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగార్జున్‌గౌడ్

సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు రెండోస్థానం

మహబూబ్ నగర్ అర్బన్, సెప్టెంబర్ 23: రాష్ట్రస్థాయి జూనియర్స్ బాల, బాలికల సాఫ్ట్ బాల్‌పోటీల్లో మహబూబ్‌నగర్ జిల్లా రెండోస్థానం దక్కించుకున్నది. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన పోటీల్లో సెమీ ఫైనల్స్‌లో సిద్ధిపేటతో మహబూబ్‌నగర్ జట్టు తలబడి 14-0తో నెగ్గింది. ఫైనల్స్‌లో నిజామాబాద్‌జట్టుతో పోరాడి రెండో స్థానం దక్కించుకున్నది.

పొందిన బహుమతి, మెడల్‌తో విద్యార్థులు